క్లుప్తంగా

ఎంఈవో వెంకటేశంకు షోకాజ్ నోటీసు జారీ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశంకు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఆర్డీవో ప్రభాకర్ గురువారం తెలిపారు. పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్న వెంకటేశం ఇన్‌చార్జి ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారని అన్నారు. జెడ్పీ బాలికల పాఠశాలలో రెండు, మూడు మార్లు తనిఖీ చేసేందుకు వెళ్లిన సమయంలో లేకపోవడంతో పాటు, ఎండీఎంలో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందడం లేదన్న ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు తెలిపారు.

అయ్యప్ప ఆలయానికి రూ.లక్షా 18 వేల విరాళం



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయానికి సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్ గురువారం రూ.లక్షా 18 వేల విరాళాన్ని అందించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. దాత ప్రశాంత్‌గౌడ్ కుటుంబాన్ని గురుస్వాములు సన్మానించారు. గురుస్వాములు చంద్రం, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

రమేశ్ కుటుంబానికి అండగా ఉంటాం

మాచారెడ్డి : అనారోగ్యంతో మృతి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రమేశ్‌నాయక్ కుటుంబానికి అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. బంజెపల్లిలో గురువారం రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొని కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా అంత్యక్రియల నిమిత్తం రూ.10 వేలు అందించారు. మాజీ జెడ్పీటీసీ రాంరెడ్డి, నాయకులు బూక్య నర్సింలు, రాజాగౌడ్, హంజీనాయక్, ఎడపల్లి శ్రీనివాస్, లస్కర్ నాయక్, భాస్కర్‌నాయక్, అబ్దుల్, హేమ్లా నాయక్ తదితరులున్నారు.

ఐటీఐ కళాశాలలో నూతన కమిటీ ఎన్నిక

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలోని ఐటీఐ కళాశాలలో గురువారం ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని ఎన్నుకున్నామని కార్యదర్శి కాంబ్లే ప్రశాంత్ తెలిపారు. అధ్యక్షుడిగా బస్వరాజ్, కార్యదర్శిగా ప్రశాంత్, ఉపాధ్యక్షుడిగా శ్రీకాంత్, అజయ్, సహాయ కార్యదర్శులుగా అక్షయ్, కిరణ్, షారుక్ తదితరులను ఎన్నుకున్నారు. కళాశాలలో ఉన్న సమస్యలు ప్రభుత్వం, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని అధ్యక్షుడు తెలిపారు.

టీఎన్జీవో నూతన కార్యవర్గానికి సన్మానం



కామారెడ్డి టౌన్: నూతనంగా ఎన్నికైన టీఎన్జీవో జిల్లా కార్యవర్గ సభ్యులను గురువారం గురు రాఘవేంద్రకాలనీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముల్క నాగరాజు, ఉపాధ్యక్షులు చక్రధర్, సాయిలు, కోశాధికారి దేవరాజులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కాలనీ అధ్యక్షుడు పట్నం విశ్వనాథ్, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఉద్యోగులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పశు సంతతిని అభివృద్ధి చేసుకోవాలి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): అన్ని గ్రామాల్లో పశు సంతతిని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా పశువైద్యాధికారి సంజయ్ అన్నారు. గురువారం ధర్మారావ్‌పేట్ గ్రామంలో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పశువులకు గర్భకోశ వ్యాధి సమస్యలు ఉంటే చికిత్స చేయించాలన్నారు. ఉత్తమ పాడి రైతులకు పాల క్యాన్‌లను పంపిణీ చేశారు. మండల పశు వైద్యాధికారిణి అనూష, వైద్యులు రవికిరణ్, రాంచందర్, పాల కేంద్రం అధ్యక్షుడు రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి ఏఎంసీ ఆధ్వర్యంలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాండూరులో గురువారం ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పశువులకు ఉచిత వైద్యసేవలు అందించారు. ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్‌పర్సన్ రజితారెడ్డి, పశువైద్యాధికారులు రవికుమార్, దివ్యశ్రీ,, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి దివిటి కిష్టయ్య, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీరామ్‌గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ డైరెక్టర్ నాగేష్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధమవుతున్న డబుల్ ఇళ్లు

- ఎల్లారెడ్డిలో 300 ఇళ్ల నిర్మాణం దాదాపు పూర్తి
- పనులు పూర్తికావడంతో లబ్ధిదారుల హర్షం



డబుల్ బెడ్ రూం ఇళ్ల వద్ద వేసిన సీసీ రోడ్డు



ఎల్లారెడ్డి శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీకి సిద్ధమవుతున్నాయి. 9వ వార్డు పరిధిలో సుమారు 300 డబుల్ బెడ్ రూం ఇళ్లకు సంబంధించిన పనులు చివరి దశకు చేరుకున్నాయి. మొత్తం 19 బ్లాకులలో 300 డబుల్ బెడ్ రూంలను ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి నిర్మించింది. లబ్ధిదారులను డ్రా పద్ధతిలో ఎంపిక చేశారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలో కొన్ని పనులు పూర్తి కాలేదు. ఇటీవల ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పరిశీలించారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో అన్ని సౌకర్యాలు కల్పించిన తరువాతనే లబ్ధిదారులకు అందించాలని ఆర్డీవో మన్నె ప్రభాకర్‌కు ఆయన సూచించారు. పెండింగ్ పనులకు సంబంధించి ఎమ్మెల్యే ప్రత్యేక నిధులను కేటాయించారు. దీంతో ఆర్డీవో ప్రభాకర్ నిత్యం పర్యవేక్షిస్తూ డబుల్ బెడ్‌రూం ఇళ్లలో ఉన్న పెండింగ్ పనులను పూర్తి చేయించారు. పనులు పూర్తి కానుండటంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే అందజేస్తాం

ఎల్లారెడ్డి శివారులో నిర్మించిన 300 డబుల్ బెడ్‌రూం ఇళ్లలో పీఆర్‌కు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్లకు, బిల్డింగ్‌కు మధ్య మట్టి పోయాలి. త్వరలోనే పనులు పూర్తి చేసి ఎమ్మెల్యే చేతుల మీదుగా డబుల్ బెడ్ రూంలను లబ్ధిదారులకు అందజేస్తాం.

– మన్నె ప్రభాకర్, ఆర్డీవో, ఎల్లారెడ్డి

‘నాణ్యమైన భోజనం అందించాలి’



వివరాలు అడిగి తెలుసుకుంటున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి

నిజాంసాగర్(జుక్కల్): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్! అంటూ గురువారం సాక్షిదినపత్రికలో వచ్చిన కథనానికి కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి స్పందించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సబ్‌కలెక్టర్ కిరణ్మయి తనిఖీ చేశారు. పాఠశాలలో 18 రోజులుగా మధ్యాహ్న భోజనం వడ్డించకపోవడంతో హెచ్ఎం, ఎంపీడీవో, ఎంఈవో, తహసీల్దార్‌ల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వంట బిల్లులు సక్రమంగా రాకపోవడం, స్లాబ్ రేట్లు ఏమాత్రం గిట్టుబాటు కావడం లేదని వంట ఏజెన్సీ నిర్వాహకుడు మధు, సబ్ కలెక్టర్‌కు వివరించారు. వంట బిల్లులు పెండింగ్ లేకుండా చూస్తామని, అవసరమైన డబ్బులను ఐకేపీ ద్వారా రుణ సదుపాయం కల్పిస్తామని సబ్ కలెక్టర్ హామీ ఇచ్చారు. దాంతో పాఠశాలలో వంట చేసేందుకు నిర్వాహకుడు అంగీకరించారు. ఎంపీడీవో గంగాధర్, తహసీల్దార్ భిక్షపతి, ఎంఈవో తిరుపతిరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ తదితరులున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

చిన్న దేవాడ స్కూల్ సందర్శన



నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని చిన్న దేవాడ ప్రాథమిక పాఠశాలను గురువారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సందర్శించారు. సాక్షి దినపత్రికలో సమ్మెలో మధ్యాహ్న భోజన ఏజెన్సీలు, పస్తులున్న విద్యార్థులు...అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి బాన్సువాడ సబ్ కలెక్టర్ స్పందించారు. పాఠశాల వెళ్లి మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడారు. ఎందుకు భోజనం పెట్టడం లేదో సమస్య అడిగి తెలుసుకున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని.. ప్రతి రోజు విద్యార్థులకు రుచికరమైన భోజనం పెట్టాలని ఆమె సూచించారు. శుక్రవారం నుంచి వంటలు చేసి పెడతామని అన్నారు. తహసీల్దార్ సురేష్, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

అమిత్ షా క్షమాపణలు చెప్పాలి





జిల్లా కేంద్రంలో అమిత్‌షా దిష్టి బొమ్మ దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు బోర్లంలో .. దళితులు



బీబీపేటలో ..



తాడ్వాయి మండలం నందివాడలో..

సాక్షి నెట్‌వర్క్: బీజేపీ అగ్రనేత, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడారని ఆరోపిస్తూ అంబేడ్కర్ సంఘాల సభ్యులు, దళితులు, కాంగ్రెస్ నాయకులు జిల్లాలో గురువారం నిరసనలకు దిగారు. అమిత్ షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. వెంటనే అమిత్ షా క్షమాపణ చెప్పి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గోపాల్‌పేటలో కొవ్వొత్తులతో ర్యాలీ తీశారు.



గుండెనెమ్లిలో ధర్నా చేస్తున్న దళిత నాయకులు



గోపాల్‌పేటలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు



మద్నూర్‌లో..

‘యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతికి చెక్ పెట్టొచ్చు’



భిక్కనూరు: రాజకీయాల్లోకి యువత అధికంగా వస్తే అవినీతి అక్రమాలకు చెక్‌పెట్టవచ్చని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు అన్నారు. గురువారం భిక్కనూరు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీరామ్ వెంకటేష్‌ను ఆయన శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ..అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీని పటిష్టం చేయాలని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషిచేయాలని సూచించారు.

బోరు మోటారు అందజేత



ఎల్లారెడ్డిరూరల్: వెంకటాపూర్ గ్రామానికి మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ గురువారం బోరు మోటారును అందించారు. బోరు మోటారు అందించిన సత్యనారాయణకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

డిగ్రీకళాశాలలో అకాడమిక్ కౌన్సిల్ సమావేశం



బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల(అటానమస్)లో గురువారం ప్రిన్సిపల్ వేణుగోపాల స్వామి అధ్యక్షతన తొలి అకాడమిక్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బోర్డు ఆఫ్ స్టడీస్, సిలబస్‌ను ఆమోదిస్తూ పలు అంశాలపై చర్చించారు. ఈప్రాంత విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా కొత్తకోర్సులను ప్రవేశపెట్టారు. అటానమస్ స్థాయికి కళాశాల ఎదగడంతో స్థానిక ఎమ్మెల్యే పోచారంతోపాటు ప్రతి ఒక్కరి కృషి ఉందన్నారు. కో–ఆర్డినేటర్ బట్టు విఠల్, ప్రొఫెసర్ గంట చంద్రశేఖర్, ఆర్ట్స్ ప్రొఫెసర్ హరిత, కామర్స్ విభాగం నుంచి ప్రొఫెసర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరాలయంలో పూజలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): తాడ్వాయిలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఇతర మండలాల నుంచి కూడా భక్తులు భారీగా తరలివచ్చారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

‘స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి’



మనోజ్‌పటేల్‌ను సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నిజాంసాగర్(జుక్కల్): గ్రామ పంచాయతీ, మండల పరిషత్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అందరూ సిద్ధంగా ఉండాలని పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ పటేల్ సూచించారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు ఆదేశాల మేరకు గురువారం మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితం, తెల్గాపూర్, దూప్‌సింగ్, గిర్నితండా గ్రామ పంచాయతీల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే మండల పరిషత్, పంచాయతీ ఎన్నికలు ఉన్నందున పార్టీ కుటుంబ సభ్యులు అందరూ ఐకమత్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో ఉంటూ గ్రూప్ రాజకీయాలు చేస్తే అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకుంటుందన్నారు. మహమ్మద్‌నగర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లయ్యగారి ఆకాష్, రమేష్‌యాదవ్, సవాయిసింగ్, కాలిక్, తాటిపల్లి సరస్వతి, సంతోష్‌రాథోడ్ ఉన్నారు.

కళాశాలలో అడ్మిషన్ల కోసం కరపత్రాల ఆవిష్కరణ



బాన్సువాడ: వచ్చే విద్యా సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాలను గురువారం ప్రిన్సిపల్ అసద్ ఫారుఖ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అసద్ మాట్లాడుతూ.. ప్రస్తుతం పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులు వచ్చే విద్య సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు చేసుకునేందుకు ఇప్పటి నుంచే ప్రచారం నిర్వహిస్తున్నామని అన్నారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా బోధన కొనసాగుతుందని అన్నారు. అధ్యాపకులు శ్రీనివాస్, గంగాధర్, రమేష్, పద్మ, రమ్యశ్రీ, స్వప్న, కీర్తి, వైశాలి, క్రాంతి, జాఫర్, రఘురాం, కవిత, అయేషా, అనుపమ, అబ్దుల్ రజాక్ తదితరులున్నారు.

ప్రైవేట్ స్కూల్ ముందు ధర్నా



కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ ప్రైవేట్ స్కూల్ ముందు విద్యార్థి సంఘాల నాయకులు గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్కూల్‌లో నిర్మాణ పనులు చేపడుతూ, తరగతి గదుల్లో సిమెంట్ సంచులు, ఇనుము, ఇసుక, కర్రలు, నిర్మాణ సామగ్రి మధ్య బోధిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థుల ఇబ్బందులను, తల్లిదండ్రులను ఫిర్యాదులను పట్టించుకోవడం లేదన్నారు. విద్యాశాఖ నుంచి అనుమతులు లేకున్నా నిబంధనలకు విరుద్ధంగా ఈ నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. తక్షణమే డీఈవో విచారణ జరిపి స్కూల్ యజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ముదాం అరుణ్, బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, తదితరులున్నారు.

సైబర్ నేరాలతో జాగ్రత్తగా ఉండాలి



దోమకొండలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై అంజనేయులు



నాగిరెడ్డిపేటలో .. ఏఎస్సై ఉమేశ్

దోమకొండ: సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరు జాగ్రత్తగా ఉండాలని దోమకొండ ఎస్సై అంజనేయులు అన్నారు. గురువారం మండల కేంద్రంలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఫోన్‌లకు వచ్చే ఓటీపీలను ఇతరులకు చెప్పవద్దని కోరారు. అదేవిధంగా ఎలాంటి లింక్ మేసేజ్‌లను ఓపెన్ చేయవద్దన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని, వాహన రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. ఏఎస్సై సుబ్రహ్మణ్యచారి, కానిస్టేబుళ్ల రమేష్, తదితరులున్నారు.

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నాగిరెడ్డిపేట ఏఎస్సై ఉమేశ్ కుమార్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం ప్రజలకు సైబర్‌నేరాలపై ఆయన అవగాహన కల్పించారు. కానిస్టేబుళ్ల చంద్రయ్య, హుస్సేన్ ఉన్నారు.



మద్నూర్‌లో అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మద్నూర్(జుక్కల్): సైబర్ నేరాలను ముందుగానే పసిగట్టి జాగ్రత్త పడాలని పోలీసు కళాబృందం సభ్యులు సూచించారు. మండల కేంద్రంలోని బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో గురువారం పోలీసు కళాజాత కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, షీటీం, డ్రగ్స్, ట్రాఫిక్ పోలీసు నియమాలపై వారు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఏఎస్సై సుధాకర్, షీటీం కానిస్టేబుల్ ప్రియాంక, ప్రిన్సిపాల్ గంగాకిషోర్, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, కళాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణతకు ప్రణాళిక రూపొందించుకోవాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): ఇంటర్మీడియట్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి 90 రోజుల ప్రణాళికలు రూపొందిచుకోవాలని ఇంటర్ నోడల్ అధికారి షేక్ సలామ్ సూచించారు. గురువారం ఆయన లింగంపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మైనార్టీ జూనియర్ కళాశాల, జ్యోతిబాపూలే గురుకుల కళాశాల, కస్తూర్బా బాలికల గురుకుల కళాశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులను వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని సూచించారు. గైర్హాజరు అవుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి కళాశాలకు వచ్చేలా చూడాలన్నారు. లేదంటే విద్యార్థుల ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రిన్సిపాల్ నరేందర్, అధ్యపకులు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విధుల్లోకి తీసుకోవాలి



బీబీపేట: బీబీపేటలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో గతంలో పని చేసిన వంట సిబ్బంది వెంకటలక్ష్మి, లక్ష్మి, అటెండర్ నవనీతలు గురువారం పాఠశాల ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. పాఠశాలలో ఎనిమిదేళ్లుగా విధులు నిర్వహించామని, కొన్ని సమస్యల వల్ల విద్యార్థులు ధర్నా చేయడంతో విధుల్లో నుండి ఉన్నతాధికారులు తొలగించారని వాపోయారు. తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఉన్నట్లుండి విధుల్లో నుంచి తీసివేయడంతో కుటుంబాలు రోడ్డున పడాల్సి వస్తుందని వాపోయారు. రెండు నెలల క్రితం వంటలు బాగా చేయడం లేదని, అంతే కాకుండా అటెండర్ విద్యార్థులతో ప్రవర్తన సరిగ్గా లేదని విద్యార్థులు ధర్నా నిర్వహించగా ముగ్గురినీ సీతారాంపల్లి కస్తూర్బా పాఠశాలకు బదిలీ చేశారు. అక్కడ కూడా వీరి ప్రవర్తన బాగా లేదని విద్యార్థులు ధర్నా చేయడంతో వారిని పూర్తిగా విధుల్లోంచి తొలగించారు. ధర్నా సమాచారం తెలియడంతో పోలీసులు వారిని అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు.

సంక్షిప్తం

మధ్యాహ్న భోజనం పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి): శెట్పల్లి ఉన్నత పాఠశాలలో గురువారం ఎంపీడీవో నరేష్ మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మట్లాడారు. ప్రతి రోజు భోజనం ఎలా ఉంటుంది.. బాగా వండుతున్నారా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే అయ్యపల్లిలో అంగన్‌వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు.

ఎల్లారెడ్డి కేజీబీవీలో..

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని కేజీబీవీలో ఎంఈవో వెంకటేశం గురువారం భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. బాగా చదవాలని సూచించారు.

ఉపాధ్యాయులు సక్రమంగా బోధించాలి

ఎల్లారెడ్డి: విద్యార్థులకు ఉపాధ్యాయులు సక్రమంగా బోధన చేయాలని కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం వెల్లుట్ల జెడ్పీ పాఠశాలలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట మండలాల జెడ్పీ, మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల కాంప్లెక్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని, పదవ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని కోరారు. ఉపాధ్యాయులు బల్వంత్‌రావు, నరేష్ తదితరులున్నారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

ఎల్లారెడ్డిరూరల్: మీసాన్‌పల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం దాతలు టై, బెల్టులు అందజేశారు. ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 1980–82 బ్యాచ్‌కు చెందిన మూర్తి, రాజశేఖర్ చౌదరిలు విద్యార్థులకు టై, బెల్టులు అందించారు. ఉపాధ్యాయులు షాకీర్ తదితరులున్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

బాన్సువాడ రూరల్: కోనాపూర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గురువారం బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు హరిలాల్‌నాయక్ పంచాయితీ కార్యదర్శి భరత్‌కు ఫిర్యాదు చేశారు. మిషన్ భగీరథ పథకం ద్వారా సరిపడా నీరు రావడం లేదన్నారు. అలాగే గ్రామంలో మురికి కాలువలు చెత్తాచెదారంతో పేరుకుపోయాయని శుభ్రం చేసి దోమలను నివారించాలన్నారు. డ్రైనేజీల్లో ఉన్న నల్లాలు తొలగించాలన్నారు. బాలయ్య ఉన్నారు.

బూత్ కమిటీ అధ్యక్షుల నియామకం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): యాచారం గ్రామంలో గురువారం బీజేపీ బూత్ కమిటీ అధ్యక్షులను నియమించారు. గ్రామంలోని బూత్ నంబర్ 8కు బి.రవి, బూత్ నంబర్ 9కు అంబర్‌సింగ్‌లను నియమించినట్లు మండలాధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. మండల ఉపాధ్యక్షుడు చక్రధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.